


# ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 94,చీఫ్ ఎడిటర్ : వి. శివ కృష్ణ, వెల : 02,బుధవారం, తేదీ : 05-08-2026

## అహంకారానికి అంతం పతనమే.. విజయ్‌పై ఎంకే స్టాలిన్ తీవ్ర విమర్శలు..




➢ త్రిషపై అభ్యంతకర వ్యాఖ్యల కేసులో డీఎంకే నేత, ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటనపై మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఢిల్లీ : త్రిషపై అభ్యంతకర వ్యాఖ్యల కేసులో డీఎంకే నేత, ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటనపై మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పక్షంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అహంకారం చివరికి పతనానికే

## ఇజ్రాయెల్‌కున్న గొప్ప స్నేహితుల్లో మోదీ ఒకరు
### బెంజమిన్ నెతన్యాహు

❖ భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి ఇజ్రాయెల్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అన్నారు.

❖ తనకున్న అత్యంత సన్నిహిత మిత్రుల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఒకరని పేర్కొన్నారు.



ఢిల్లీ :భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి ఇజ్రాయెల్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అన్నారు. తనకున్న అత్యంత సన్నిహిత మిత్రుల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఒకరు అని, భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు మిగతా..2లో

## ఆ సమస్యలపై సమాధానాలు దాటవేస్తూ మోదీ, షా పార్లమెంటును అవమానిస్తున్నారు

వాస్తవాలు వెలుగులోకి రావాలంటే పార్లమెంటు ఉభయ సభల్లోనూ ఈ రెండు అంశాలపై చర్చ జరగాలని ఖర్గే డిమాండ్



ఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే. రామమందిర విరాళాల చోరీ, విద్యార్థులపై లాఠీఛార్జ్ అంశాలపై సమాధానాలు ఇవ్వడానికి భయపడి తప్పించుకుంటున్నారని ఆరోపించారు. ఇలా చేస్తూ పార్లమెంటును అవమానిస్తున్నారని విమర్శించారు. వాస్తవాలు వెలుగులోకి రావాలంటే పార్లమెంటు ఉభయ సభల్లోనూ ఈ రెండు అంశాలపై చర్చ జరగాలని ఖర్గే డిమాండ్ చేశారు. అయితే, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న ఖర్గే కూడా ఈ విషయాన్ని సభలో లేవనెత్తినప్పటికీ, ఆయనకు మాట్లాడే అవకాశం లభించలేదు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు సంబంధించిన విలువైన కానుకలు, నగదు విరాళాలు, భూమి కొనుగోళ్లు, నిర్వహణలో నిధుల దుర్వినియోగంపై మిగతా..2లో

## ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి రేంత్ రెడ్డి దారుణ వ్యాఖ్యలు చేశారన్న అరవింద్




➢ విద్య పట్ల కనీస చిత్తశుద్ధి లేని వ్యక్తి అంటూ విమర్శలు

➢ నామినేషన్ పత్రాలను రేవంత్ రెడ్డి సొంతంగా నింపగలరా

➢ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా తయారైందని వ్యాఖ్య

హైదరాబాద్: ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత దారుణమని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి

## ఇక అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ తప్పనిసరి - ప్రభుత్వం ఆదేశాలు..!!




▸▸ తెలంగాణ ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది.

▸▸ అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు కేవలం

▸▸ టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్: గడువులోగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఇంటర్నెట్ సేవలు అందించేలా ఏర్పాట్లు చేయాలని టీ ఫైబర్ అధికారులను మంత్రి నిర్దేశించారు. సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలను వినియోగిస్తూ బిల్లులు చెల్లించవద్దని తేల్చి చెప్పారు. ఈ మేరకు ఐటీ అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు కీలక సూచనలు చేసారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని స్పష్టం చేసారు. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1 తర్వాత ప్రైవేట్ ఆపరేటర్లకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్నెట్ నిమిత్తం ఎలాంటి బిల్లులు చెల్లించొద్దని అధికారులకు సూచించారు. 'టీ-స్వాన్' నెట్‌వర్క్‌ను నెల రోజుల్లోగా టీ-ఫైబర్‌కు బదిలీ చేసేలా చర్యలు తీసుకోవాలని.. ప్రతిష్టాత్మక 'ఫ్యూచర్ సిటీ'కి కూడా పూర్తిస్థాయిలో టీ-ఫైబర్ ఇంటర్నెట్ సేవలు అందేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు.

### హైదరాబాద్- విశాఖ మధ్య తగ్గనున్న 56 కిమీ దూరం: గ్రీన్ ఫీల్డ్ హై వే షురూ..!! మంత్రి కీలక ఆదేశాలు

కాగా, రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికి ఇంటర్నెట్' ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీధర్ బాబు ఆదేశించారు. గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ కనెక్టివిటీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు.

## బీఆర్ఎస్‌కు క్షుద్రపూజలు చేయడం అలవాటని టీపీసీసీ చీఫ్ ఆరోపణ




● మాజీ మంత్రి హరీశ్ రావు ఆలయాల పర్యటనలపై ప్రశ్నలు

● జూన్ 2, జులై 23 తేదీల్లో హరీశ్ ఎక్కడున్నారో చెప్పాలని డిమాండ్

● పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని పట్టించుకోలేదన్న మహేష్ గౌడ్

● తెలంగాణ ప్రజలకు ఆ పార్టీ క్షమాపణ చెప్పాలని వ్యాఖ్య

హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీకి క్షుద్రపూజలు చేయడం ఒక అలవాటుగా మారిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఇటీవల కొన్ని ఆలయాలను సందర్శిం చడంపై ఆయన పలు ప్రశ్నలు లేవనెత్తారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేశ్ గౌడ్ మాట్లాడారు. జూన్ 2న తిరుచ్చి, జులై 23న శివమొగ్గకు హరీశ్ రావు ఎందుకు వెళ్లారని ఆయన నిలదీశారు.

మిగతా..2లో

## సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల వేళ అన్ని ఆర్జిత సేవలను రద్దు చేసిన టీటీడీ

వృద్ధులు, దివ్యాంగులతో పాటు పలు ప్రత్యేక దర్శనాలు కూడా నిలిపివేత

భక్తులు మార్పులను గమనించి సహకరించాలని టీటీడీ విజ్ఞప్తి

అమరావతి : కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక నిర్ణయం తీసుకుంది. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిది రోజుల పాటు తిరుమలలో అన్ని రకాల ఆర్జిత సేవలతో పాటు ప్రత్యేక ప్రవేశ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనున్న ఈ ఉత్సవాలకు లక్షలాదిగా తరలివచ్చే సామాన్య భక్తులకు పెద్దపీట వేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. టీటీడీ ప్రకటన ప్రకారం, బ్రహ్మోత్సవాల సమయంలో మిగతా..2లో

## హైదరాబాద్ కు భారీ వర్ష సూచన.. ఎల్లో అలర్ట్ జారీ



వాయుగుండం కారణంగా తెలంగాణలో భారీ వర్షాలు

హైదరాబాద్ లో నేడు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం

వాహనదారులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్న అధికారులు

హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా తెలంగాణలో వర్షాలు విరామం లేకుండా కురుస్తున్నాయి. వీటి ప్రభావంతో నేడు హైదరాబాద్ నగరం వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు నగర ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుందని, పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నిన్న హైదరాబాద్‌తో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కుండపోత వర్షం ముంచెత్తింది. మిగతా..2లో

## PM`ABHIవీ నిధుల వినియోగంలో గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యం..




➢ పీఎం-ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (PM`ABHIM) అమలులో ఆంధ్రప్రదేశ్‌లో గత వైసీపీ ప్రభుత్వం నిధుల వినియోగంలో విఫలమైందని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో వెల్లడించింది.

➢ 2021 నుంచి 2024 మధ్య కేంద్రం విడుదల చేసిన నిధుల్లో కొంత భాగం మాత్రమే వినియోగించారని తెలిపింది.


న్యూఢిల్లీ: పీఎం-ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (PM`ABHIM) అమలులో

## పేదరికం లేని సమాజం చూడాలనేది నా కల

▸▸ 2024లో ఎవరూ ఊహించని విధంగా ఎన్డీఏ గెలిచింది

▸▸ భయంకర పరిస్థితులు, ఒక విప్లవం కారణంగా 57శాతం ఓట్లు వచ్చాయి

▸▸ రాష్ట్రం అభివృద్ధి బాట పట్టిందన్న సీఎం చంద్రబాబు



అమరావతి : రాష్ట్ర సమగ్ర సమాచారం ప్రజలకు తెలపడం ముఖ్యమని సీఎం చంద్రబాబు అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్థికశాఖపై శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం చంద్రబాబు 2024 నాటి పరిస్థితులు, తాజా పరిస్థితులపై వాస్తవాలు ప్రజల ముందు పెట్టారు. రెండు రాష్ట్రాలు అభివృద్ధి చేశా: ప్రజలకు ఆర్థిక పరిస్థితిపై సమగ్ర సమాచారం చెబుతున్నట్లు సీఎం వివరించారు. ఇదొక చారిత్రక అంశమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశామన్నారు. ఎప్పటికప్పుడు ప్రోగ్రెస్ రిపోర్టులు ప్రజలకు తెలియజేయాలని అధికారులుకు సూచించారు. ప్రభుత్వం బాగా పని చేస్తుందనేందుకు భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం నిదర్శనమన్నారు. ప్రభుత్వం పనిచేస్తే ప్రజలు ఎలా స్పందిస్తారో అన్నదానికి భోగాపురం ఉదాహరణ అని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తు అనుసంధానానికి అంతర్జాతీయ గేట్‌వేగా తయారు చేశామన్నారు. సమైక్యాంధ్రప్రదేశ్‌లో తెలుగు జాతి కోసం అభివృద్ధి చేశామని, మిగతా..2లో




## జలధార పనుల పురోగతిపై పవన్ సమీక్ష
## 33 లక్షల మందికి దాహార్తి తీర్చేలా

● అమరజీవి జలధార ద్వారా గోదావరి జిల్లాల్లో తాగునీటి కష్టాలకు చెక్

● త్వరలో రాష్ట్రవ్యాప్తంగా జల్ జీవన్ మిషన్ పనులు పరిశీలిస్తానన్న పవన్

అమరావతి : జల్ జీవన్ మిషన్ కింద అమరజీవి జలధార ప్రాజెక్టు ద్వారా గోదావరి జిల్లాల్లో తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం లభించనుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు.

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక
బుధవారం 05-08-2026

మొదటి పేజీ తరువాయి

## సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

అష్టదళ పాదపద్మారాధన, తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ వంటి ఆర్జిత సేవలను పూర్తిగా నిలిపివేయనున్నారు. వీటితో పాటు వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు, ఎన్ఆర్ఐలు, దాతలకు కల్పించే ప్రత్యేక ప్రవేశ దర్శనాలను కూడా రద్దు చేశారు. ఈ మార్పులను భక్తులందరూ గమనించి, టీటీడీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఏటా బ్రహ్మోత్సవాల సమయంలో శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ విపరీతంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి అత్యధిక దర్శన సమయం కేటాయించేందుకు టీటీడీ ఈ చర్యలు చేపట్టింది. ఈ తొమ్మిది రోజుల పాటు స్వామివారి వాహన సేవలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి కార్యాలయం అధికారిక ప్రకటన జారీ చేసింది.

## హైదరాబాద్ కు భారీ వర్ష సూచన.. ఎల్లో అలర్ట్ జారీ

గడిచిన 24 గంటల్లో కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 18.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా... వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోనూ భారీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రోడ్లపైకి వస్తున్న వాహనదారులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## ఇజ్రాయెల్‌కున్న గొప్ప స్నేహితుల్లో మోదీ ఒకరు: బెంజమిన్ నెతన్యాహు

(India Israel Relations). ప్రపంచ వేదికపై ఇజ్రాయెల్‌కు బలమైన మద్దతు అందిస్తున్న దేశాల్లో భారత్ కీలకమైనదని నెతన్యాహు చెప్పారు. ఇజ్రాయెల్ ఒంటరిగా ఉందనే ప్రచారం వాస్తవం కాదని నెతన్యాహు స్పష్టం చేశారు. భారత్‌తో పాటు పలు దేశాలతో ఇజ్రాయెల్ దౌత్య, ఆర్థిక, సాంకేతిక, భద్రతా రంగాల్లో సహకారం పెరుగుతోందని చెప్పారు. ఇక, భారత్‌లో ఇజ్రాయెల్‌కు లభిస్తున్న ఆదరణ ఎంతో విలువైనదని ఆయన అన్నారు India Partnership). భారత్-ఇజ్రాయెల్ మధ్య రక్షణ, వ్యవసాయం, సాంకేతికత, సైబర్ భద్రత, ఆవిష్కరణలు వంటి అనేక రంగాల్లో ఇప్పటికే బలమైన భాగస్వామ్యం కొనసాగుతోంది (Netanyahu India). ఇటీవలి కాలంలో ఇరు దేశాల నాయకుల మధ్య సన్నిహిత సంబంధాలు మరింత బలపడటంతో వ్యూహాత్మక సహకారం కూడా వేగంగా విస్తరిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధాని మోదీ, ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లి పలు కీలక ఒప్పందాలు చేసుకున్న సంగతి తెలిసిందే.

## అహంకారానికి అంతం పతనమే.. విజయ్‌పై ఎంకే స్టాలిన్ తీవ్ర విమర్శలు..

దారి తీస్తుందని ముఖ్యమంత్రి విజయ్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు (MK Stalin about Vijay). ఉదయనిధి అరెస్టు చట్టపరమైన చర్య కాదని, కావేరి జలాల సమస్య నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు చేసిన రాజకీయ ప్రయత్నమని స్టాలిన్ ఆరోపించారు. ప్రభుత్వ అహంకారం ప్రజలకు స్పష్టంగా కనిపిస్తోందని, అలాంటి ధోరణి పతనాన్ని మరింత వేగవంతం చేస్తుందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశానికి ఒక రోజు ముందు ఈ అరెస్టు జరగడం, ప్రతిపక్ష నాయకుడిని అసెంబ్లీకి దూరంగా ఉంచే ప్రయత్నమేనన్నారు (Trisha Remarks Case). రాజకీయ విమర్శకులు, ప్రతిపక్ష నాయకులు, విద్యార్థులు, రైతులు, నిరసనకారుల గొంతు నొక్కడానికి టీవీకే ప్రభుత్వం పదేపదే అరెస్టులను ఉపయోగిస్తోందని డీఎంకే నాయకులు ఆరోపించారు (Udhayanidhi Stalin Arrest). త్రిషపై అసభ్యకర వ్యాఖ్యల వివాదం నేపథ్యంలో నమోదైన కేసులో ఉదయనిధి స్టాలిన్‌ను చెన్నైలోని ఆయన నివాసం నుంచి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణకు తరలించారు. ఈ చర్య తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర దుమారానికి దారితీసింది.

## బీఆర్ఎస్‌కు క్షుద్రపూజలు చేయడం అలవాటని టీపీసీసీ చీఫ్ ఆరోపణ

ఆయా తేదీల్లో హరీశ్ రావు ఎక్కడ ఉన్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలకు సంబంధించి తన వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని మహేశ్ గౌడ్ వెల్లడించారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ తెలంగాణకు చేసిందేమీ లేదని, అందుకే ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఎన్నో త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో ప్రజల నమ్మకాన్ని బీఆర్ఎస్ పూర్తిగా కోల్పోయిందని ఆయన పేర్కొన్నారు. చేసిన తప్పులకు గాను బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి రేంత్ రెడ్డి దారుణ వ్యాఖ్యలు చేశారన్న అరవింద్

అరవింద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం చేసిన వ్యాఖ్యలు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల ఆత్మస్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్య పట్ల కనీస చిత్తశుద్ధి లేని వ్యక్తి విద్యాశాఖ మంత్రిగా ఉండటం ఏమాత్రం సరైనది కాదని విమర్శించారు. సీఎం వద్ద ఉన్న విద్యాశాఖ బాధ్యతలను వెంటనే మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తే బాగుంటుందని సూచించారు. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను రేవంత్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించిన అరవింద్... ఎవరి సహకారం కూడా తీసుకోకుండా సీఎం నామినేషన్ పత్రాలనైనా సొంతంగా నింపగలరా? అని సవాల్ విసిరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా తయారైందని... కనీసం బ్లాక్ బోర్డులు, చాక్ పీసులు, సరైన మరుగుదొడ్లు కూడా లేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఒక్క ప్రభుత్వ పాఠశాలనైనా సందర్శించారా? అని ప్రశ్నించారు. ఉన్న పాఠశాలలను బాగుచేయడం వదిలేసి, కొత్త నిర్మాణాల పేరుతో కమీషన్లు దండుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా విద్యా రంగానికి ప్రాధాన్యమిచ్చి సమస్యలను పరిష్కరించాలని ఎంపీ డిమాండ్ చేశారు.

## ఈ వారం చివర్లో కర్ణాటక, కేరళలో దంచికొట్టనున్న వానలు- తెలంగాణలో బలంగా గాలులు వీచే ఛాన్స్

ఈ రుతుపవన కాలంలో 12 శాతం తగ్గిన వర్షపాతం- ఆగస్టు మొదటి వారం చివర్లో కేరళ, కర్ణాటకలో భారీ వర్షాలు- తెలంగాణలో బలమైన గాలులు వీచే అవకాసం ఉందని ఐఎండీ అంచనా

ఈ వారం చివర్లో కేరళ, మహేతో పాటు తీరప్రాంత కర్ణాటక, లక్షద్వీప్‌లలో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. అలాగే కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో బలమైన గాలులు వీస్తాయని పేర్కొంది. తీరప్రాంత కర్ణాటకలో ఆగస్టు 9 వరకు భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. ఆయా రాష్ట్రాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల కొండచరియలు విరిగిపడటం, వరదలు, ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడవచ్చని హెచ్చరించింది. అందుకే కొండ ప్రాంతాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాల నివాసితులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ రుతుపవన కాలంలో దేశవ్యాప్తంగా 12 శాతం లోటు వర్షపాతం నమోదైందని స్పష్టం చేసింది. రానున్న వారాల్లో మధ్య, పశ్చిమ భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాల తీవ్రత తగ్గుతుందని ఐఎండీ అంచనా వేసింది. ఉత్తర, తూర్పు, ఈశాన్య భారతదేశంలో మరోసారి ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మారుతున్న రుతుపవన సరళి కారణంగా ఇప్పటికే అసోం వరదలతో అతలాకుతలం అయ్యిందని, కేరళలో కొండచరియలు విరిగిపడ్డాయని స్పష్టం చేసింది. పలు రాష్ట్రాల్లో వర్ష సంబంధిత విపత్తులు ఏర్పడ్డాయని వెల్లడించింది.

నార్త్ ఇండియా

ఐఎండీ ప్రకారం, జూన్ 1- ఆగస్టు 3 మధ్య దేశంలో సాధారణంగా కురవాల్సిన 472.6 మి.మీల వర్షపాతానికి బదులుగా 416.3 మి.మీల వర్షపాతం మాత్రమే నమోదైంది. దీంతో భారత్‌లో 12 శాతం లోటు వర్షపాతం నమోదైంది. గత మూడేళ్లలో అత్యంత వేడైన ఆగస్టు రాత్రిని నమోదు చేసిన నేపథ్యంలో దేశ రాజధాని దిల్లీకి ఐఎండీ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మంగళవారం దిల్లీలో మరోసారి వర్షం కురిసే అవకాశం ఉంది. మారుతున్న రుతుపవన సరళి కారణంగా రానున్న రోజుల్లో ఉత్తర భారతదేశంలో వర్షపాతం ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. జమ్మూకశ్మీర్, లద్ధాఖ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో ఉరుములు, ఈదురు గాలులతో కూడిన విస్తారమైన వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. రానున్న మూడు రోజుల పాటు జమ్మూకశ్మీర్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండగా, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో ఆగస్టు 9 వరకు భారీ వర్షాలు కొనసాగవచ్చని ఐఎండీ పేర్కొంది. పంజాబ్, హరియాణా, చండీగఢ్, దిల్లీ, యూపీలలో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది.

తూర్పు భారతదేశం (ఈస్ట్ ఇండియా)

రానున్న ఆరు రోజుల్లో బంగాల్, సిక్కిం, ఒడిశా, ఝార్ఖండ్, బిహార్‌లో విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఆయా రాష్ట్రాలో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఝార్ఖండ్, బిహార్, ఒడిశాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండగా, బంగాల్, సిక్కింలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ భారీ వర్షాల వల్ల వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

ఈశాన్య భారతదేశం

అసోం, మేఘాలయల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. అలాగే అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మణిపుర్, మిజోరం, త్రిపుర రాష్ట్రాల్లో కూడా రానున్న కొద్ది రోజుల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. కాగా, ఇటీవలే పడిన భారీ వర్షాల కారణంగా అసోంలో 87 మంది చనిపోయారు. ఏడు జిల్లాల్లో 1.28 లక్షల మందికి పైగా ప్రజలు ప్రభావితమయ్యారు.

# పేదరికం లేని సమాజం చూడాలనేది నా కల

మొదటి పేజీ తరువాయి



రెండు రాష్ట్రాలు కూడా తానే అభివృద్ధి చేసినట్లు సీఎం పేర్కొన్నారు. 'సంపద పెరిగితే ఉపాధి పెరుగుతుంది. జీవన ప్రమాణాలు పెంచగలిగితేనే ప్రభుత్వానికి సంతృప్తి. సమాజంలో మార్పు తేవాలనే పీ4 కార్యక్రమం తీసుకొచ్చాం. దీనివల్ల 2.4 లక్షల కుటుంబాలకు సాయం అందుతోంది. ఆర్థిక అసమానతలు తగ్గించడమే ప్రథమ ప్రాధాన్యంగా పని చేస్తున్నాం. పేదరికం లేని సమాజం చూడాలనేది నా కల. మార్గదర్శి-బంగారు కుటుంబం నినాదం తీసుకొచ్చాం. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల అమలుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం. బీసీ, మైనారిటీలకు పెద్దఎత్తున సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. మహిళా సంఘాలకు రూ.14,757 కోట్లతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. 97 శాతం మహిళా సంఘాలు బ్యాంకు రుణాలు వినియోగించుకుంటున్నాయి.' -చంద్రబాబు, ముఖ్యమంత్రి పాలన బాగుంటే దాని ఫలితాలు ప్రజా జీవితంలో ప్రస్ఫుటం అవుతాయన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడ్డాక బ్రాండ్ ఆంధ్ర పునరుద్ధరణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తున్నామన్నారు. ఉమ్మడి ఏపీలో తలసరి ఆదాయం రూ.95,231గా ఉండేదని, విభజన తర్వాత తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,24,104, ఏపీలో తలసరి ఆదాయం రూ.93,903 అని వివరించారు. ఈ పరిస్థితుల నుంచి సీఏజీఆర్ 13.5 శాతం వృద్ధి స్థాయికి చేరామన్నారు. 2019-24 మధ్య జీఎస్‌డీపీ వృద్ధిరేటు 3.18 శాతం తగ్గిందని, వృద్ధిరేటు తగ్గడంతో రూ.6.94లక్షల కోట్ల నష్టం జరిగిందని సీఎం వివరించారు. పొదుపు చేశాం: వైఎస్సార్సీపీ పాలనలో నీతి ఆయోగ్ నివేదిక చూస్తే జరిగిన ఆర్థిక విధ్వంసం తేటతెల్లం అవుతోందని సీఎం అన్నారు. పెండింగ్ బిల్లులు రూ.48,616 కోట్లు ఉంటే దానిని రూ.29,259 కోట్లకు తగ్గించాగలిగామని సీఎం స్పష్టం చేశారు. 370లోన్లపై చర్చలు జరిపి 1100 కోట్లు ఆదా చెయ్యగలిగామని మెత్తంగా రూ. 8600 కోట్లు పొదుపు చేశామని ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రంలో భయంకరమైన పరిస్థితులు ఉండేవని సీఎం అన్నారు. ఒక విప్లవం కారణంగా 57 శాతం ఓట్లు వచ్చాయని, 2024లో ఎవరూ ఊహించని విధంగా ఎన్డీఏ గెలిచిందని అన్నారు. గొడవలు పడితే సాధించేది ఏమీ ఉండదని, కష్టపడి పనిచేస్తే ఫలితం పది రెట్లు ఉంటుందన్నారు. 2019 వైఎస్సార్సీపీ పాలనలో సంస్థలు రాలేదని వారి హయాంలో బ్రాండ్ ఆంధ్రా దెబ్బతిందని ధ్వజమెత్తారు. మూడు రాజధానులు అంటే షాక్‌కు గురయ్యామని ఎద్దేవా చేశారు.

## జలధార పనుల పురోగతిపై పవన్ సమీక్ష - 33 లక్షల మందికి దాహార్తి తీర్చేలా ప్రాజెక్టులు

మొదటి పేజీ తరువాయి



పనుల పురోగతిపై మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్ సమీక్షించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో 33 లక్షల మందికి దాహార్తి తీర్చేలా ఈ ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్తున్నామని తెలిపారు. నిర్ణీత గడువులోపు ముఖ్యమైన నిర్మాణాలు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ జల్ జీవన్ పనుల వేగం పెంచాలని పవన్ సూచించారు. ఇన్ టేక్ వెల్స్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్లతోపాటు పైప్ లైన్ల నిర్మాణం వంటి కీలక పనుల పురోగతికి సంబంధించిన వివరాలు ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు వివరించారు. తాగునీటి కష్టాలకు చెక్ : రూ.3,050 కోట్లతో చేపట్టిన పనులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా సాగుతుండడం పట్ల పవన్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో రూ.1,650 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకాన్ని 10 నియోజకవర్గాల పరిధిలో సుమారు 20 లక్షల మందికి తాగునీరు అందించనున్నారు. రెండు ఇంటేక్ వెల్స్, యాక్సెస్ బ్రిడ్జిల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన 182 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మాణం పూర్తయిందన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో రూ.1,400 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టు ద్వారా సుమారు 13.50 లక్షల మందికి తాగునీటి కష్టాలు తీరనున్నాయి. దీనికి సంబంధించి ఇంటేక్ వెల్, యాక్సెస్ బ్రిడ్జి, 155 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంతో అమరజీవి జలధారకు శ్రీకారం చుట్టామన్నారు. పనులన్నీ నిర్ణీత గడువులోపు పూర్తి చేసేలా సంబంధిత శాఖలతో సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. పైప్ లైన్ల నిర్మాణానికి సంబంధించి ఇతర శాఖల అనుమతులు పెండింగ్ లో ఉంటే ఆ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్ అండ్ బీ, జాతీయ రహదారి అథారిటీ, పంచాయతీరాజ్ శాఖలు, అవసరం ఉన్న చోట అటవీశాఖలతో సమన్వయం చేసుకుంటూ, పనులు సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న తీర ప్రాంత గ్రామాల్లో పనుల వేగం పెంచాలని, అదే సమయంలో నిర్మాణ పనుల నాణ్యతలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన జల్ జీవన్ మిషన్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని పవన్ వెల్లడించారు. నాణ్యతాపరమైన తనిఖీలు స్వయంగా నిర్వహిస్తామని తెలిపారు.

## PM`ABHIM నిధుల వినియోగంలో గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యం..

మొదటి పేజీ తరువాయి



గత వైసీపీ ప్రభుత్వం నిధుల వినియోగంలో విఫలమైందని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో వెల్లడించింది. ఈ పథకం కింద కేంద్రం విడుదల చేసిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించలేదని తెలిపింది. కేంద్రం ఇచ్చిన వివరాల ప్రకారం.. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ౹ావీ-ూాదీ౹౦×వీ కింద ఆంధ్రప్రదేశ్‌కు విడుదల చేసిన రూ.3.75 కోట్లలో ఒక్క రూపాయి కూడా అప్పటి వైసీపీ ప్రభుత్వం ఖర్చు చేయలేదని పేర్కొంది. 2021 నుంచి 2024 మధ్య కేంద్రం మొత్తం రూ.55.29 కోట్ల నిధులు అందించగా, కేవలం రూ.35.45 కోట్లను మాత్రమే వినియోగించినట్లు వెల్లడించింది. మూడేళ్ల కాలంలో దాదాపు రూ.20 కోట్ల కేంద్ర నిధులు వినియోగించకుండా మిగిలిపోయాయని కేంద్రం తెలిపింది. దీంతో ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభావం పడిందని పేర్కొంది.

### కూటమి ప్రభుత్వంలో పెరిగిన నిధుల వినియోగం

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ౹ావీ-ూాదీ౹౦×వీ నిధుల వినియోగం గణనీయంగా పెరిగిందని కేంద్రం వివరించింది. 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో నిధుల వినియోగం 166 శాతానికి పైగా పెరిగినట్లు తెలిపింది. గతంలో పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.20 కోట్ల నిధులను కూడా వినియోగించినట్లు వెల్లడించింది.

### నెల్లూరులో ఆరోగ్య వసతుల అభివృద్ధి

౹ావీ-ూాదీ౹౦×వీ నిధులతో నెల్లూరు జిల్లాలో పలు ఆరోగ్య మౌలిక వసతుల ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చాయని కేంద్రం వివరించింది. ఆత్మకూరు ఆసుపత్రిలో ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. అలాగే నెల్లూరు ఏసీఎస్ఆర్ మెడికల్ కాలేజీలో రూ.23.75 కోట్ల వ్యయంతో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ భవన నిర్మాణం పూర్తయిందని పేర్కొంది. పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రెండు అర్బన్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కేంద్రం వెల్లడించింది.

## ఆ సమస్యలపై సమాధానాలు దాటవేస్తూ మోదీ, షా పార్లమెంటును అవమానిస్తున్నారు

మొదటి పేజీ తరువాయి



తీవ్రమైన ఆరోపణలు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. "ఇది కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి సంబంధించిన విషయం. ఈ ట్రస్ట్ ఏర్పాటు కేంద్ర ప్రభుత్వంతోనే జరిగింది, దీనికి సంబంధించిన ప్రకటనను స్వయంగా ప్రధాని మోదీ సభలో చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ ట్రస్ట్‌కు 70 ఎకరాలకు పైగా భూమిని అప్పగించింది. భూమి పూజ నుంచి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం వరకు ప్రతి ముఖ్యమైన సందర్భంలోనూ మోదీ స్వయంగా హాజరయ్యారు. ఇటువంటి పరిస్థితుల్లో, కానుకల చోరీతో సహా వచ్చిన తీవ్రమైన ఆరోపణల విషయంలో ప్రధాని బాధ్యత నుంచి తప్పించుకోలేరు. ఇప్పుడు ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖ ఇతర దర్యాప్తు సంస్థలు ఎక్కడ ఉన్నాయో ఆయన సభకు చెప్పాలి. శ్రీరాముని పేరుతో దోచుకునే వారు దేశం మొత్తానికి క్షమాపణ చెప్పాలి. దేశాన్ని తప్పుదోవ పట్టించడం మానుకోవాలి." అని ఆయన అన్నారు. అనంతరం పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడిన ఖర్గే, సభ సజావుగా సాగేందుకు మోదీ, షా సభకు రావాలన్నదే తమ డిమాండ్ అని స్పష్టం చేశారు. "మేము ఈ అంశాలపై చర్చించాలని అనుకుంటున్నాము. ఉభయ సభల్లోనూ చర్చకు అనుమతించాలని మేము చైర్మన్, స్పీకర్‌ను కోరుతున్నాము. రామమందిర విరాళాల సొమ్ము అపహరణ, విద్యార్థులపై లాఠీఛార్జ్ గురించి చర్చిస్తే వాస్తవాలు వాటంతటవే బయటపడతాయి. కానీ ఏదో కారణం వల్ల ప్రభుత్వం భయాందోళనలకు గురైనట్లు కనిపిస్తోంది. అంతేకాకుండా హోంమంత్రి అమిత్ షా కూడా సభకు రావడం లేదు. వారికి భయమైనా ఉండాలి. లేదా సభకు రాకపోవడం ద్వారా పార్లమెంటును అవమానించాలని వారు భావిస్తుండాలి." అని ఖర్గే ఆరోపించారు. ఈ అంశాలపై లోక్‌సభ, రాజ్యసభ రెండింటిలోనూ ప్రతిపక్ష సభ్యులు నిరసనలు తెలుపుతూ పార్లమెంటు కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తున్నారు. వీటిపై సమాధానం డిమాండ్ చేస్తూ కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు పార్లమెంటు భవన ఆవరణలో నిరసనలు చేపట్టాయి. అలాగే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశాయి.

# చదువు లేనోడివి నీకు విద్యాశాఖ ఎందుకు?.. రేవంత్ రెడ్డికి ఎంపీ అర్వింద్ ఓపెన్ చాలెంజ్

### ఇతరుల సహాయం లేకుండా ఎన్నికల నామినేషన్ పత్రం నింపలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ఇంజనీరింగ్, గ్రాడ్యుయేట్ విద్యార్థుల గురించి మాట్లాడుతున్నారని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు.

రెండో వ్యక్తి సహాయం లేకుండా నామినేషన్ పత్రం నింపగలవా అని సీఎంకు అర్వింద్ ఓపెన్ చాలెంజ్ విసిరారు. చదువు లేని రేవంత్ రెడ్డి తన వద్ద విద్యాశాఖను పెట్టుకోవడానికి సిగ్గులేదా అని నిలదీశారు. ముఖ్యమంత్రి తన వద్ద ఉన్న విద్యాశాఖను శ్రీధర్ బాబు లాంటి చదువుకున్న వారికి అప్పగించాలన్నారు. రేవంత్ రెడ్డి పరిపాలన, ఆయన ఇస్తున్న స్టేట్‌మెంట్లు అన్నీ తెలంగాణ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేవిధంగా ఉన్నాయని దుయ్యబట్టారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన అర్వింద్.. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతోందని ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. గత బీఆర్ఎస్ పాలకులు ఇదే రకంగా చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### మీ మాటలతో ఎవరైనా ఉద్యోగాలు ఇస్తారా?

65 శాతం క్లాసులు విని పరీక్షలు రాసి పాసైన ఇంజనీరింగ్ విద్యార్థులకు అప్లికేషన్ ఫామ్‌లు నింపడం రాదని ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రపంచంలోనే ఒక రాష్ట్రంలో అత్యధికంగా ఇంజినీరింగ్‌లను తయారు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని అలాంటి విద్యార్థుల భవిష్యత్‌ను రేవంత్ రెడ్డి ఏం చేయదలుచుకున్నారని ప్రశ్నించారు. సీఎం ఈ రకంగా మాట్లాడితే మన ఇంజనీరింగ్ పిల్లలకు ఎవరైనా ఉద్యోగాలు ఇస్తారా? ఇప్పుడు ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పరిస్థితి ఏంటని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు అదే కార్యక్రమంలో ఉన్న ఉపాధ్యాయులు చప్పట్లు కొట్టడం కూడా చాలా తప్పన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ఆడబిల్లలకు టాయిలెట్స్ లేని స్కూల్స్ ఉన్నాయన్నారు. ఉన్న స్కూల్స్ బాగు చేయకపోయినా కమిషన్ల కోసం కొత్త స్కూల్స్ కడుతామంటున్నారని మండిపడ్డారు. టీచర్ల పీఆర్సీ ఇవ్వని ముఖ్యమంత్రి ఉపాధ్యాయుల బాగోగుల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ ఇప్పటికీ ప్రతిపక్ష నేతగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.

### తమాషాలు చేస్తున్నావా? లేక టైమ్ పాస్ చేస్తున్నావా?

గతంలో తాము ఎక్కడికైనా వెళ్తే చెప్పులు ఎత్తుకెళ్లేవారు వచ్చినట్లు మమ్మల్నీ చూస్తున్నారని ముఖ్యమంత్రి మాట్లాడారని అలా మాట్లాడితే ఎవరైనా పారిశ్రామికవేత్తలు పెట్టుబడి పెట్టడానికి ముందుకు వస్తారా అని నిలదీశారు. నువ్వేం ముఖ్యమంత్రివి? తమాషాలు చేస్తున్నావా? లేక టైమ్ పాస్ చేస్తున్నావా? అని మండిపడ్డారు. చదివినోళ్లకు చదవనోళ్లకు ఫ్యూచర్ లేకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. మరో వైపు హైడ్రా పేరుతో రియల్ ఎస్టేట్ పూర్తిగా నాశనం పట్టించారని ఓ వైపు కోర్టు చీవాట్లు పెడుతుంటే రేవంత్ రెడ్డి ప్రొటెక్ట్ చేస్తున్నావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి తన కుటుంబ సభ్యులకు దోచిపెడుతున్నాడని ఆరోపించారు.

## పేద బిడ్డల బంగారు భవిష్యత్తే లక్ష్యం..
## 'విద్య,వసతి-వికాసం'తో సంక్షేమ హాస్టళ్లకు నూతన ఊపు




**నెల్లూరు, ఆగస్టు 4, ప్రజా న్యూస్ నెట్‌వర్క్:** పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం నెల్లూరు జిల్లా యంత్రాంగం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'విద్య,వసతి–వికాసం' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్యేలు కావ్యా కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, డిప్యూటీ కలెక్టర్ కేశవర్ధన్ రెడ్డి, డీఆర్వో విజయకుమార్, బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ, సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న నిరుపేద విద్యార్థుల కోసం కలెక్టర్ హిమాన్షు శుక్లా చేపట్టిన 'విద్య––వసతి––వికాసం' కార్యక్రమం ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రజల సంక్షేమం కోసం వినూత్న కార్యక్రమాలు చేపడుతున్న కలెక్టర్‌ను జిల్లా ప్రజలు శాశ్వతంగా గుర్తుంచుకుంటారని అన్నారు.జిల్లాలోని 155 సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న 19 వేల మంది విద్యార్థుల కోసం రూ.34.80 కోట్లతో ప్రత్యేక ప్రణాళిక రూపొందించారని తెలిపారు. ఇందులో భవనాల మరమ్మతులు, తాగునీటి సరఫరా, విద్యుత్ పనులు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి రూ.20.35 కోట్లు, విద్యార్థులకు అవసరమైన పరికరాల కొనుగోలుకు రూ.14.45 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు.విద్యార్థుల కోసం వాషింగ్ మెషీన్లు, ఇన్వర్టర్లు, స్మార్ట్ టీవీలు, కంప్యూటర్లు, ఫ్యాన్లు, లైట్లు, వంట సామగ్రి, లైబ్రరీ పుస్తకాలు తదితర అన్ని సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి తమవంతు సహకారంతో పాటు కంపెనీల సీఎస్ఆర్ నిధులు, దాతల సహకారం ద్వారా అవసరమైన పరికరాలు సమకూర్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.అల్లీపురంలో తమ కుటుంబం రెండు హైస్కూళ్లకు, ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి భూమి దానం చేసిన విషయాన్ని గుర్తుచేసిన ఆయన, విద్యాభివృద్ధికి ఎల్లప్పుడూ తమ కుటుంబం అండగా ఉంటుందని చెప్పారు.విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం విద్యా రంగంలో అనేక సంస్కరణలు చేపడుతోందని పేర్కొన్న సోమిరెడ్డి, ఆయన సహకారంతో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ కళాశాల మంజూరైందని, గొలగమూడి గురుకులానికి జూనియర్ కళాశాల కూడా మంజూరైనట్లు తెలిపారు.గిరిజనుల సంక్షేమంపై కూడా స్పందించిన ఆయన, ఇటీవల పర్యటనల్లో అనేక మంది గిరిజనులకు ఆధార్ కార్డులు లేకపోవడం తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఆధార్ లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు వారు దూరమవుతున్నందున ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, సచివాలయ ఉద్యోగులు, సంబంధిత అధికారుల ద్వారా ప్రతి అర్హుడికి ఆధార్ కార్డు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## యనమల రామకృష్ణుడిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రముఖులు

### తేటగుంట శిబిర కార్యాలయంలో మాజీ ఆర్థిక మంత్రితో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకుల భేటీ



**తుని, ఆగస్టు 4 ప్రజా న్యూస్ నెట్వర్క్:** తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడిని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన పలువురు ప్రముఖులు తేటగుంట శిబిర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీకి చెందిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి యనమల రామకృష్ణుడిని మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అనంతరం అనపర్తి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్ రెడ్డి యనమల ఆశీర్వాదం తీసుకున్నారు.అలాగే గోదావరి జిల్లాల జనసేన సమన్వయకర్త రావాడ నాగు, తూర్పుగోదావరి జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు సత్యదేవానంద బాబా కూడా యనమల రామకృష్ణుడిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలపై పరస్పరం చర్చించినట్లు సమాచారం.

## యనమల రామకృష్ణుడిని మర్యాదపూర్వకంగా కలిసిన చైల్డ్ రైట్స్ కమిషన్ ప్రతినిధులు –తేటగుంట శిబిర కార్యాలయంలో భేటీ



**తుని, ఆగస్టు 4 ప్రజా న్యూస్ నెట్వర్క్:** తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి సత్యనారాయణ రాజు, కమిషన్ సభ్యుడు మందాల గంగ సూర్యనారాయణ తేటగుంట శిబిర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వేటుకూరి సత్యనారాయణ రాజు యనమల రామకృష్ణుడికి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకొని పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం.

## ఇంటింటా తెలుగుదేశం..
## పాయకరావుపేటలో విస్తృత ప్రచారం



**పాయకరావుపేట, ఆగస్టు 4 ప్రజా న్యూస్ నెట్వర్క్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'ఇంటింటా తెలుగుదేశం పార్టీ' కార్యక్రమంలో భాగంగా పాయకరావుపేట పట్టణంలోని 70, 71, 72 బూత్‌ల పరిధిలో మంగళవారం విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు పట్టణ పార్టీ అధ్యక్షుడు యాల్ల వరహాలుబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విలియం కేరి ముఖ్య అతిథులుగా హాజరై ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రానున్న కాలంలో చేపట్టనున్న కార్యక్రమాలపై కూడా అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.కార్యక్రమంలో సీనియర్ నాయకులు జూరెడ్డి ప్రసాద్, యాల్ల సన్యాసిరావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు గొల్లపల్లి నాగు, పట్టణ ఉపాధ్యక్షుడు చిరుకూరి పేర్రాజు, బూత్ ఇన్‌చార్జులు బోడపాటి శ్రీను, కడియం శివతో పాటు పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాయకరావుపేట ప్రభుత్వ ఐటీఐలో రెండో విడత కౌన్సెలింగ్ గడువు పొడిగింపు




**పాయకరావుపేట, ఆగస్టు 4 ప్రజా న్యూస్ నెట్వర్క్:** ప్రభుత్వ ఐటీఐ, పాయకరావుపేటలో రెండో విడత ప్రవేశాల కౌన్సెలింగ్‌కు సంబంధించిన గడువును పొడిగించినట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ తెలిపారు. ఐటీఐలో ప్రవేశం కోరుకునే అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు ఆగస్టు 10, 2026 సాయంత్రం 5 గంటల వరకు అవకాశం కల్పించారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఆగస్టు 10, 2026లోపు ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసుకోవాలని సూచించారు.రెండో విడత కౌన్సెలింగ్ ఆగస్టు 12, 2026న నిర్వహించనున్నట్లు తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 7013737243, 9989478278 నంబర్లను సంప్రదించాలని ఐటీఐ యాజమాన్యం కోరింది.

# నల్లగొండలో నకిలీ 'గోల్డ్ ఫ్లాగ్' సిగరెట్ల కలకలం..
### కల్తీ మాయాజాలంపై ఆరోపణలు




**నల్లగొండ బ్యూరో, ఆగస్టు 04, ప్రజా న్యూస్ నెట్‌వర్క్:** నల్లగొండ జిల్లాలో 'గోల్డ్ ఫ్లాగ్' పేరుతో నకిలీ సిగరెట్లు విక్రయాలు జరుగుతున్నాయంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలైన బ్రాండ్‌ను పోలి ఉండే ప్యాకెట్లతో నాణ్యతలేని పొగాకును ప్యాక్ చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారని పలువురు వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ నకిలీ ఉత్పత్తులు అధిక లాభాల కోసం అక్రమంగా విక్రయించబడుతున్నాయని, వాటి నాణ్యతపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కల్తీ సిగరెట్ల వినియోగం వల్ల ఆరోగ్యంపై మరింత ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ధూమపాన ప్రియులు పేర్కొంటున్నారు.అదే సమయంలో, నకిలీ ఉత్పత్తులను అరికట్టాల్సిన ఇండియన్ టొబాకో కార్పొరేషన్ (ఐటీసీ) పేరునే కొందరు దుర్వినియోగం చేస్తున్నారంటూ ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదా స్పందన వెలువడలేదు.ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టి, నకిలీ సిగరెట్ల తయారీ, సరఫరా, విక్రయాల్లో పాల్పడుతున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు, స్థానికులు కోరుతున్నారు. అలాగే మార్కెట్‌లో విక్రయమవుతున్న సిగరెట్ల నాణ్యతపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## ఆడబిడ్డల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
### -ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్




**కొండ మల్లెపల్లి, ఆగస్ట్ 04, ప్రజా న్యూస్ నెట్వర్క్:** దేవరకొండ నియోజకవర్గం కొండమల్లేపల్లి మండలానికి చెందిన 27 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.27,03,132 విలువైన కల్యాణ లక్ష్మి చెక్కులను దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ సంబంధిత అధికారులతో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలపై వివాహ సమయంలో పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కల్యాణ లక్ష్మి పథకం ఎంతో ఉపయోగపడుతోందని అన్నారు. కల్యాణ లక్ష్మి పథకం ద్వారా పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహానికి ప్రభుత్వం ఆర్థిక చేయూత అందించడం వల్ల కుటుంబాలకు ఎంతో ఊరట లభిస్తోందన్నారు.ప్రజలకు హామీ ఇచ్చిన సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేస్తూ, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సహాయం అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు .సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకురావాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు మూల సూత్రమని ఎమ్మెల్యే అన్నారు. దేవరకొండ నియోజకవర్గంలోని ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అర్హులైన వారు తప్పకుండా దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ సహాయాన్ని పొందాలని ఎమ్మెల్యే బాలు నాయక్ సూచించారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్ రెడ్డి, కొండమల్లేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు, గుడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్, జరుపుల శంకర్, సంబంధిత శాఖ అధికారులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ పారిపల్లెమ్మ వారి దర్శనం..
## ఆలయ ధర్మకర్త దుంగ దేవన్ రాజును ఘనంగా సత్కరించిన ఆలయ కమిటీ..



**ప్రజా న్యూస్, ఆగస్టు04, విశాఖపట్నం స్టాఫ్ రిపోర్టర్, పీ.ఎం. నాయుడు :** అనకాపల్లి జిల్లా మునగపాక మండలం వాడ్రాపల్లి గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ పారిపల్లెమ్మ వారిని ఆంధ్ర ప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానం, ఆలయ ధర్మకర్త మరియు జనసేన పార్టీ, 61వ వార్డు అధ్యక్షులు , దుంగ దేవన్ రాజు అమ్మవారిని మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు.ఆలయ కమిటీ సభ్యులు,గ్రామపెద్దలు కండువా వేసి సాంప్రదాయకంగా సత్కరించారు, దేవన్ రాజు మాట్లాడుతూ.. ఆలయ కమిటీ సభ్యులకు , గ్రామ పెద్దలకు ఈ గౌరవ సత్కారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు, తల్లి దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలని అందరూ ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో.. సనాతన ధర్మాన్ని కాపాడుతూ.. ఆధ్యాత్మికం మార్గంలో.. అందరూ నడవాలని అమ్మవారిని ప్రార్థించారు, ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు , పూజారులు తదితరులు పాల్గొన్నారు.

## జై రామ్ నగర్‌లో పలు ప్రజా సేవా అభివృద్ధి కార్యక్రమాల పరిశీలన



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 4 ప్రజా న్యూస్ నెట్వర్క్ :** కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని జై రామ్ నగర్‌లో నిర్వహించిన డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ డి సి డి పి అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా ఇండియా పోస్ట్ అందిస్తున్న పోస్టల్ సేవింగ్స్ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్, ఆధార్, పాస్‌పోర్ట్ ఇన్సూరెన్స్ సేవలతో పాటు, పోస్ట్ ఆఫీస్ ఖాతాల ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, ఆర్థిక సేవలు మరియు ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఎంపీ లాడ్స్ నిధుల ద్వారా నూతనంగా మంజూరైన బోర్ పాయింట్ ఏర్పాటుకు సంబంధించి, సంబంధిత అధికారులు మరియు కాలనీ సభ్యులతో కలిసి స్థలాన్ని పరిశీలించి, కాలనీ ప్రజల అవసరాలకు అనుగుణంగా బోర్ పాయింట్ ఏర్పాటు చేసే ప్రక్రియను పరిశీలించారు. అలాగే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ూ×=) కార్యక్రమాన్ని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి కార్యక్రమం పురోగతిని సమీక్షించి అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కోరిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి.

## సమయపాలనలో నిర్లక్ష్యం 23 మందికి మెమోలు



**అనంతసాగరం ఆగష్టు 4 ప్రజాన్యూస్ నెట్ వర్క్ :** అనంతసాగరం మండలంలోని 16 స్వర్ణ గ్రామ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిలో 23 మందికి మెమోలు జారీ చేశారు సమయపాలన పాటించకపోవడం కార్యాలయం నుంచి బయటకు వెళ్లేటప్పుడు మూమెంట్ రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయకపోవడం వంటి నిబంధనల ఉల్లంఘనలపై ఈ చర్యలు తీసుకున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో షాన్‌వాజ్ తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగులు విధుల పట్ల బాధ్యతతో వ్యవహరించి ప్రజలకు సకాలంలో సేవలు అందించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ సేవల్లో క్రమశిక్షణ సమయపాలనకు అత్యంత ప్రాధాన్యం ఉందని పేర్కొన్నారు. కార్యాలయాల పనితీరును మరింత మెరుగుపర్చే ఉద్దేశంతో మండలంలోని అన్ని స్వర్ణ గ్రామ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు కొనసాగనున్నట్లు తెలిపారు. ఇకపై నిబంధనలు ఉల్లంఘించిన వారిపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ప్రజలకు నాణ్యమైన, పారదర్శక సేవలు అందించేందుకు ప్రతి ఉద్యోగి విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించాలని అధికారులు సూచించారు.

## హైదరాబాద్ టీ అడ్డా టీ స్టాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న బొంగునూరి కిషోర్ రెడ్డి




**కుత్బుల్లాపూర్ ఆగస్టు 4 ప్రజా న్యూస్ నెట్వర్క్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బహదూర్‌పల్లి 294వ డివిజన్‌లో విష్ణువర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హైదరాబాద్ టీ అడ్డా టీ స్టాల్ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఫోటో కాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా బొంగునూరి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, స్థానిక యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తూ కొత్త వ్యాపారాలను ప్రారంభించడం అభినందనీయమని పేర్కొన్నారు. వ్యాపారం విజయవంతంగా సాగాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏ ఆర్ సాదు యాదవ్ శివారెడ్డి సాయికుమార్ రవికుమార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, టీం బీకేఆర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో పరిచయం..
### పెళ్లి పేరుతో నమ్మించి మోసం చేశారంటూ దివ్యాంగ న్యాయవాది ఆవేదన

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 4 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :** హుజూర్‌నగర్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదుట ఓ దివ్యాంగ న్యాయవాది నిరసన చేపట్టిన ఘటన సోమవారం చర్చనీయాంశంగా మారింది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడిన అనంతరం తనను వివాహం చేసుకున్న వ్యక్తి కొంతకాలానికే తనను వదిలివెళ్లడంతో పాటు నగదు, ఇంటి సామగ్రిని తీసుకెళ్లాడని బాధితురాలు ఆరోపించారు. వివాహం జరిగి సుమారు పది నెలలు గడిచినప్పటికీ తనకు న్యాయం జరగలేదని, గతంలో నమోదు చేసిన ఫిర్యాదుపై తగిన చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను కోరారు. ఈ క్రమంలో నిందితుడిని తానే గుర్తించి పోలీసులకు అప్పగించినప్పటికీ, అనంతరం అతడు కనిపించకుండా పోవడంపై బాధితురాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ పోలీస్ స్టేషన్‌లో నిరసన చేపట్టారు. బాధితురాలికి హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు అండగా నిలిచి ఆమెకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై హుజూర్‌నగర్ ఎస్ఐ స్పందిస్తూ, గతంలో నమోదైన మిస్సింగ్ కేసు బదిలీ ప్రక్రియలో ఉందని, అయినప్పటికీ బాధితురాలి పరిస్థితిని అర్థం చేసుకుని పోలీసుల తరఫున అవసరమైన సహకారం అందించామని తెలిపారు. రాత్రి వేళల్లో నిందితుడిని పోలీస్ స్టేషన్‌లో ఉంచడం సాధ్యం కానందున సంబంధిత వ్యక్తులతో మాట్లాడించినట్లు వివరించారు. బాధితురాలు కొత్తగా పూర్తి వివరాలతో ఫిర్యాదు అందజేస్తే ఆరోపణలపై విచారణ జరిపి, చట్టపరంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. ఘటనకు సంబంధించిన వాస్తవాలను సమగ్రంగా పరిశీలించి బాధితురాలికి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు..

## హైవేపై ప్రమాదకర గుంతలకు తాత్కాలిక పరిష్కారం.
### రంగంలోకి దిగిన ట్రాఫిక్ పోలీసులు



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 4 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :** సూర్యాపేట జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ, సిబ్బంది సోమవారం సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి సూర్యాపేట పట్టణ పరిధిలోని జాతీయ రహదారి––65పై వాహనదారులకు ప్రమాదకరంగా మారిన పెద్ద గుంతలను దగ్గరుండి పూడ్చివేయించారు. విస్తరణ పనులు, ఇటీవల కురిసిన వర్షాలు, భారీ వాహనాల రద్దీ కారణంగా జాతీయ రహదారిపై పలుచోట్ల గుంతలు ఏర్పడి ద్విచక్ర వాహనదారులతో పాటు ఇతర వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.గుంతలను తప్పించే క్రమంలో వాహనాల వేగం అకస్మాత్తుగా తగ్గడంతో ప్రమాదాలకు అవకాశం ఉండటంతో పాటు ట్రాఫిక్ నిలిచిపోతున్న పరిస్థితిని గమనించిన ట్రాఫిక్ పోలీసులు వెంటనే స్పందించారు. మట్టి, కంకరతో గుంతలను నింపించి తాత్కాలికంగా మూసివేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారుల భద్రతే పోలీసుల మొదటి ప్రాధాన్యమని, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ముందస్తు చర్యగా గుంతలను పూడ్చివేసినట్లు తెలిపారు. జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ, పరిమిత వేగంతో జాగ్రత్తగా ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.

## కామ్రేడ్ సంతోష్ మరణం దురదృష్టం



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 4 ప్రజా న్యూస్ నెట్వర్క్ :** పార్టీ నిర్వహించిన అనేక కార్యక్రమాలను విజయవంతం చేయడానికి కృషిచేసి పార్టీ విధేయుడిగా పనిచేసిన ఒక యువకుడ్ని కోల్పోవడం పార్టీకి తీరని నష్టమని సిపిఐ నాయకులు అన్నారు వారికి వారి కుటుంబానికి సంతాపాన్ని తెలియజేస్తున్నామని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వారి కుటుంబనికి అండగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు యూసుఫ్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యేసు రత్నం ఏ మండల కార్యదర్శి స్వామి సహాయ కార్యదర్శిలు రాములు, హరినాథ్ రావు, ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు ప్రవీణ అధ్యక్షులు బాబు శాఖ కార్యదర్శులు కొండయ్య వెంకటేష్ సిపిఐ నాయకులు ఇమామ్ యాదగిరి వెంకటేష్ అరవింద్ శ్రీకాంత్ జంబు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల వెనుక చీకటి మాటున మద్యం మజిలీ..?




**సూర్యాపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 4, ప్రజా న్యూస్ నెట్‌వర్క్:** హుజూర్‌నగర్ పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనుక భాగంలో చీకటి, తక్కువ ఎత్తులో ఉన్న గోడలు, వెలుతురు లేకపోవడం వల్ల రాత్రివేళల్లో అనుమానాస్పద రాకపోకలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రాత్రి వేళల్లో కొందరు వ్యక్తులు అక్కడ మద్యం సేవిస్తున్నారని, సిగరెట్ అవశేషాలు, ఖాళీ మద్యం సీసాలు, ప్లాస్టిక్ చెత్త వదిలివెళ్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పాఠశాల వెనుక భాగం పరిశుభ్రత లేకుండా మారడంతో పాటు విద్యార్థుల భద్రతపై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.ఈ నేపథ్యంలో హుజూర్‌నగర్ పోలీసులు స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, రాత్రివేళల్లో ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే వీధి దీపాలు ఏర్పాటు చేయడం, చెట్ల కొమ్మలను తొలగించడం, బౌండరీ గోడలను ఎత్తు పెంచడం, చెత్తను వెంటనే తొలగించి పాఠశాల పరిసరాల్లో భద్రతను మరింత పటిష్ఠం చేయాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నారు.



# అలియాస్ రుక్మిణి గ్లింప్స్ రిలీజ్

నితిన్ హీరోగా నాచురల్ స్టార్ నాని నిర్మాణంలో ఓ సినిమా రాబోతుంది. ఈ మూవీ టైటిల్‌తో పాటు గ్లింప్స్‌ను సోమవారం రిలీజ్ చేశారు. ఈ సినిమాకు అలియాస్ రుక్మిణి అనే పేరును ఖరారు చేశారు. హీరో నాని, డైరెక్టర్ మురళీ వాయిస్ ఓవర్‌తో ఈ గ్లింప్స్ ఆసక్తిని పంచింది. ఇందులో కృష్ణ అనే పాత్రలో నితిన్ కనిపించబోతున్న ట్లు చూపించారు. గరం గోపాల్, ఆమెకు ఆమె అంటే ఇష్టం, వ్రతం వెంకన్న అనే రచనలను రుక్మిణి రాసినట్లుగా గ్లింప్స్‌లో కనిపించింది. నితిన్‌కు జోడీగా బాలీవుడ్ బ్యూటీ ఆఫియా సయీద్ హీరోయిన్‌గా నటిస్తోన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీప్తి ఘంటా ఈ మూవీని నిర్మి స్తున్నారు. నేటి నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలైనట్లు సమాచారం.



## బుట్టబొమ్మ పెళ్లికి చాలా టైముందట

బుట్టబొమ్మ పూజా హెగ్డే పెళ్లిపీటలు ఎక్కబోతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ప్రియుడు రోహన్ మెహ్రాతో ఈ ఏడాదే ఏడడుగులు వేయబోతున్నట్లు చెబుతున్నారు. చాలా కాలంగా సాగుతోన్న తమ ప్రేమ బంధాన్ని పెళ్లి పీటలపైకి తీసుకెళ్లేందుకు ఈ జంట రెడీ ఐనట్లు సమాచారం. ఈ రూమర్లపై పూజా టీమ్ క్లారిటీ ఇచ్చింది.పెళ్లి వార్తల్లో నిజం లేదు. ఈ రూమర్లు ఎలా వచ్చాయో, ఎవరూ క్రియేట్ చేశారో తెలియదు. అవన్నీ అవాస్తవాలే. నిరాధారమైన వార్తలను ప్రచారం చేయద్దు. పూజా పెళ్లికి ఇంకా చాలా టైమ్ ఉంది. ఆ రోజు వస్తే తనే స్వయంగా అందరితో ఆ గుడ్‌న్యూస్‌ను పంచుకుంటుంది అని ఆమె టీమ్ పేర్కొంది. ప్రస్తుతం తెలుగులో శ్రీశ్రీ అనే సినిమాలో దుల్కర్ సల్మాన్‌కు జోడీగా కనిపించబోతోంది ఈ సొట్టబుగ్గల సుందరి.






## బిగ్‌బాస్ అగ్నిపరీక్ష.. డేట్ ఇదే

బిగ్‌బాస్ తెలుగు సీజన్ 10 కౌంట్‌డౌన్ మొదలైంది. బిగ్‌బాస్ అగ్నిపరీక్ష ప్రీమియర్స్ డేట్స్‌ను సీజన్ 9 విన్నర్ కళ్యాణ్ పడాల రివీల్ చేశాడు. ఆగస్ట్ 15 నుంచి జియో హాట్‌స్టార్‌తో పాటు స్టార్ మాలో అగ్నిపరీక్ష ప్రీమియర్ కానున్నట్లు వెల్లడించారు. ఓ ప్రోమో వీడియోను రిలీజ్ చేసి సాధారణ వ్యక్తిగా అసాధారణ కలలతో తన ప్రయాణాన్ని ప్రారంభించి, బిగ్‌బాస్ విజేతగా ఎదిగిన తీరుని వివరించాడు. గత సీజన్‌లో కామన్ మ్యాన్స్ సెలెక్షన్ కోసం బిగ్‌బాస్ అగ్నిపరీక్షను నిర్వహించారు. ఇందులో విన్నర్‌గా నిలిచిన కంటెస్టెంట్లు బిగ్‌బాస్ హౌజ్‌లోకి అడుగుపెట్టారు. బిగ్‌బాస్ సీజన్ 10 సెప్టెంబర్ ఫస్ట్ వీక్ నుంచి లాంచ్ కాబోతుంది.



## 40 లక్షలు అందుకే అడిగాం

జయం రవి, ఆర్తి మధ్య విడాకుల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. జయం రవి నుంచి నెలకు 40 లక్షలు తాత్కాలిక భరణం కోరుతూ ఆర్తి పిటీషన్ వేయగా కోర్టు కొట్టేసింది. ఈ తీర్పుపై ఆర్తి తల్లి కోలీవుడ్ ప్రొడ్యూసర్ సుజాత విజయ్ కుమార్ రియాక్ట్ అయ్యారు. జయం రవి అబద్ధాల కోరు అంటూ కామెంట్లు చేసింది. ఆర్తి పిల్లలు అమెరికన్ స్కూల్‌లో చదువుతున్నారు. వారి ఏడాది ఫీజు కోటి వరకు అవుతుంది. రెండేళ్లుగా ఆ ఫీజులు నేనే భరిస్తున్నా. అందుకే 40 లక్షలు తాత్కాలిక భరణంగా అడగాం. నిజాలు తెలుసుకోకుండా ఆర్తిదే తప్పంటూ విమర్శిస్తు న్నారు. పిల్లలను కలవకుండా చేస్తున్నామంటూ జయం రవి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రతి వీకెండ్స్‌లో పిల్లలను కలవవచ్చు. కానీ రవి రావడం లేదు. ఆర్తి హక్కుల కోసమే పోరాడుతోంది. ఆస్తుల కోసం కాదు అని సుజాత చెప్పుకొచ్చారు.

## 41 గంటలు నిద్రపోలే

సినిమాల కోసం కీర్తి సురేష్ పడుతోన్న కష్టం సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. ఆమె ఇన్‌స్టాలో ఓ పోస్టు పెడుతూ వివరంగా రాసుకొచ్చింది. నాన్‌స్టాప్ షూటింగ్‌ల కారణంగా 41 గంటలు నిద్ర పోలేదని అన్నది. ఓ షూటింగ్ కంప్లీట్ అయిన తర్వాత మరో షూటింగ్.. 41 గంటలు మెలకువగా ఉంటూ పనిచేస్తూనే ఉన్నా. కనీసం సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టడానికి కూడా ఓపిక లేదు అంటూ అలసిపోయి కనిపిస్తున్న ఓ ఫొటోను అభిమానులతో పంచుకుంది. అయితే నాని ప్యారడైజ్ మూవీలో స్పెషల్ సాంగ్ కోసమే కీర్తి కష్టపడుతోందని ఫ్యాన్స్ కామెంట్లు పెడుతూ ప్రశంసలు కురిపించారు. కాగా ప్రస్తుతం తెలుగులో విజయ్ దేవరకొండ రౌడీ జనార్ధనలో హీరోయిన్‌గా నటిస్తోంది కీర్తి.

## స్పైడర్‌మ్యాన్ సంచలనం.. ఒడిస్సీ రికార్డుకు చెక్

టామ్ హాలండ్ నటించిన స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డే ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులు బద్దలు కొడుతోంది. విడుదలైన నాలుగు రోజుల్లోనే ది ఒడిస్సీ చిత్ర వసూళ్లను అధిగమించింది. భారత్‌లో ఈ చిత్రం రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించి దేశంలో అత్యంత భారీ ఓపెనింగ్ అందుకున్న హాలీవుడ్ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. నాలుగో రోజు భారత్‌లో రూ.306.37 కోట్ల గ్రాస్, రూ.256.20 కోట్ల నెట్ కలెక్షన్లు నమోదు చేసినట్లు ట్రేడ్ ట్రాకర్ శాక్‌నిల్క్ తెలిపారు. ఆదివారం ఒక్కరోజే 18,051 షోల ద్వారా రూ.76 కోట్ల నెట్ వసూలు చేయగా, తొలి వీకెండ్ కలెక్షన్లు రూ.250 కోట్ల మార్క్‌ను దాటాయి. ప్రపంచవ్యాప్తంగా తొలి వీకెండ్‌లో సుమారు రూ.8,100 కోట్లు వసూలు చేసింది.

